కేసీఆర్ మళ్లీ రావాలి

- తెలంగాణ తిరుగులేని శక్తిగా ఎదగాలి
- రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ మళ్లీ రావాలని, తెలంగాణ తిరుగులేని శక్తిగా ఎదగాలని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘకాలం పోరాడి తెలంగాణను సాధించి, రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన కేసీఆర్ మార్గదర్శనం అవసరాన్ని సమాజం గుర్తించిందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం పరితపించిన సాధారణ పౌరుడిగా కేసీఆర్ తిరిగి తెలంగాణకు దిశానిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. మరో పది, పదిహేనేండ్లు కేసీఆర్ తెలంగాణకు మార్గదర్శనం చేయాలని అభిలషించారు.

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే!

మొదటిపేజీ తరువాయి...

పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు. రుణమాఫీ అయిన వారి కంటే కానీ వారే ఎక్కువగా ఉన్నారని, ఆ ప్రభావం ఎన్నికలపై పడుతుందని క్షేత్రస్థాయి క్యాడర్ సమాచారం ఇచ్చినట్టుగా పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఎన్నికలకు వెళ్లాలంటే రాబోయే రోజుల్లో రుణమాఫీకి రూ.14 వేల కోట్లు, రైతు భరోసాకు దాదాపు రూ. 10 వేల కోట్లు అవసరమవుతాయని వ్యవసాయ అధికారులు లెక్కలు వేశారు. వీటికే మొత్తం రూ.24వేల కోట్ల వరకు అవసరమవుతాయి. హామీ ఇచ్చినట్టుగా ఆసరా పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచాల్సి ఉంటుంది. దీనికి అదనంగా రూ. 1000 కోట్లు అవసరమవుతాయని తేల్చారు. వీరి సంఖ్య దాదాపు 45 లక్షలుగా ఉన్నది. కాబట్టి పెన్షన్ పెంచి ఇవ్వకుంటే ఆ ప్రభావం ఎన్నికలపై పడుతుందని, వారు బీఆర్ఎస్ వైపు మళ్లే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. దీనికితోడు ఉద్యోగులకు ఐదు డీఏలు, కల్యాణలక్ష్మిలో భాగంగా తులం బంగారం ఇలా అనేకం అంశాలు ప్రభుత్వం మెడపై కత్తిలా వేలాడుతున్నాయి. ప్రజలు ఇంత ఆగ్రహంగా ఉన్న సమయంలో ఎన్నికలకు వెళ్తే పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తాయని పార్టీ సీనియర్లు, ఎమ్మెల్యేలు చెప్పినట్టు తెలిసింది.

ఎన్నికలను త్వరగా నిర్వహిద్దామని మొదట అనుకున్నా, ఇప్పట్లో ఎన్నికల జోలికి వెళ్లవద్దన్న ఆలోచన చేసి వెనక్కి తగ్గినట్టుగా చెప్తున్నారు. దీంతో వచ్చే ఏడాది మొదటి త్రైమాసికం కల్లా రుణమాఫీ, రైతు భరోసా నిధులను జమచేసి ఆ తరువాత ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్టుగా సమాచారం.

కొత్త కమిషన్‌తో మరింత ఆలస్యం?

రెండు రోజుల క్రితమే బీసీ కమిషన్ గడువు ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా ట్రిపుల్ టెస్ట్‌కు డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న కమిషన్ గడువు పొడిగించి ఉంటే త్వరగా నివేదిక వచ్చి ఉండేది. కానీ ఆ కమిషన్ గడువు పొడగించలేదు. ఇది కూడా ఎన్నికలు ఇప్పట్లో లేవనడానికి ఆధారమని చెప్తున్నారు. కొత్త కమిషన్ నియామకానికి ప్రభుత్వం మొగ్గు చూపినట్టుగా సమాచారం. కమిషన్ నియామకం తరువాత ట్రిపుల్ టెస్ట్, సుప్రీంకోర్టు తీర్పు, ఇతర రాష్ట్రాలు ఏ విధంగా చేశాయి? తదితర అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ తరువాత గ్రామాల్లో ఓటరు జాబితా ఆధారంగా కానీ, లేదంటే బీసీ గణన ప్రకారం కానీ రిజర్వేషన్ ఖరారు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 21 తరువాత తుది ఓటరు జాబితా ప్రచురిస్తారు. ఆ తరువాత ఓటరు జాబితా ప్రకారమా లేదా జనాభాలో బీసీ గణన చేయడమా అన్నది నిర్ణయించాల్సి ఉంటుంది. కులగణన అయితే కనీసం ఆరేడు నెలల సమయం పడుతుందని, ఓటరు జాబితా ప్రకారం తీసుకున్నా కనీసం రెండు నెలల సమయం పడుతుందని బీసీ సంఘాల నాయకులు అంచనా వేస్తున్నారు. ఇదంతా కాకుండా హడావుడిగా మమ అనిపించేస్తే జరిగే పొరపాట్లపై కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి కోర్టుకు వెళ్తే ప్రక్రియ మొదటికి వచ్చే అవకాశం ఉందని, ఇప్పట్లో ఎన్నికలు ఉండవని చెప్తున్నారు. ఇలా ఏ విధంగా చూసినా స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో ఉండవని, వచ్చే సంవత్సరమే జరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

42 శాతానికి పడని అడుగులు

రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి స్పష్టత రాలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో అర్భాటంగా ప్రకటించారు. అచరణకు వచ్చేసరికి ప్రభుత్వం కుంటి సాకులు చెప్తున్నదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రభుత్వపరంగా రిజర్వేషన్లు సాధ్యం కాదని, పార్టీపరంగా రిజర్వేన్లు ఇద్దామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడాన్ని బట్టి చూస్తే బీసీలకు గతంలో కంటే రిజర్వేషన్లు పెరిగే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు.

వ్యవస్థను నిర్మించిన కేసీఆర్‌పై విమర్శలా?

- ప్రజలకు కాంగ్రెస్ ఏం చేసింది
- ఒక్క హామీనైనా అమలు చేశారా?
- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

మాట్లాడుతున్న మాజీమంత్రి ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 1: ఉమ్మడి రాష్ట్రంలో ధ్వంసమైన వ్యవస్థలను.. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ రాజ్యాంగబద్ధంగా నిర్మించారని, అలాంటి గొప్ప నాయకుడిపై విమర్శలు చేస్తారా? అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్ అయ్యారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ఆ పార్టీ నాయకులను నిలదీశారు. ఎన్నికల హామీల్లో ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా? అని ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని ప్రశ్నిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. అసలు అధికారంలో ఉండి ఏం ఘనకార్యం చేశారని మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరుగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క గ్రామంలోనైనా రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేశారా? అని నిలదీశారు. రాష్ట్రంలో 40 శాతానికి మించి రుణమాఫీ కాలేదని చెప్పారు. కేసీఆర్ హయాంలో రూ.16 వేల కోట్లతో 30 లక్షల మందికి, రూ.19 వేల కోట్లతో 37 లక్షల మంది రైతులకు రుణమాఫీ అందించామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ రవీందర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాలమాకులలో హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు

ఆ'టీచర్ల'ను సస్పెండ్ చేయాలి

రంగారెడ్డి కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 1 : ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులను కులం పేరుతో అవమానించిన టీచర్లను వెంటనే సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఆదివారం శంషాబాద్ మండలం పాలమాకుల కస్తుర్బా గాంధీ హాస్టల్‌ను వెంకటయ్య సందర్శించారు. హాస్టల్‌లోని వాష్‌రూమ్‌లు, డైనింగ్ హాల్‌తోపాటు భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థినులను అవమానించిన టీచర్ ప్రశాంతి, ఎస్‌వో మాధవి, ఏఎన్ఎం శాంతమ్మలను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాబోధన సరిగా లేదని విద్యార్థులు తన దృష్టికి తెచ్చినట్టు చెప్పారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించడంతోపాటు వారికి నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఆదేశించారు. పిల్లలకు ప్రతిరోజూ ఫిల్టర్ నీళ్లు ఇవ్వాలని, మూత్రశాలలు పెంచాలని సూచించారు. అనంతరం డీఈవో, ఆర్డీవో, ఎస్సీ డీడీలతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులతోపాటు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ తదితరులు ఉన్నారు.

చేపపిల్లల పంపిణీకి స్పందన కరువు

- ఐదు జిల్లాలకు టెండర్లు శూన్యం
- మిగిలిన జిల్లాలకూ నామమాత్రమే
- 27 జిల్లాలకు 84 టెండర్లు దాఖలు
- ఆగస్టు ముగిసినా సర్కారు మీనమేషాలు
- ఆలస్యమైతే చేపల పెరుగుదలకు ఇబ్బందే
- ఈసారి రొయ్యపిల్లల పంపిణీ లేనట్టే

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీ టెండర్లకు స్పందన అంతంత మాత్రంగానే లభించింది. నిరుటి బిల్లులు చెల్లించకపోవడంతో పంపిణీదారులు పెద్దగా ముందుకు రాలేదు. దీంతో 5 జిల్లాలకు కనీసం ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. ఇక మిగిలిన జిల్లాలకు కూడా నామమాత్రంగానే టెండర్లు దాఖలైనట్టు తెలిసింది. ఈ ఏడాది హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో ఉచితంగా 85 కోట్ల చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ గతంలో రెండుసార్లు టెండర్లను పిలిచింది. అప్పట్లో కేవలం 3 టెండర్లు మాత్రమే రావడంతో మరోసారి టెండర్లను ఆహ్వానించి, ఈ నెల 13 వరకు గడువు ఇచ్చింది. ఆ గడువు ముగియడంతో టెండర్లను ఓపెన్ చేసింది. వాటిలో మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాలకు కనీసం ఒక్క టెండరు కూడా రాలేదని తెలిసింది. మిగిలిన 27 జిల్లాలకు 84 టెండర్లు దాఖలైనట్టు సమాచారం. అంటే.. సగటున ఒక్కో జిల్లాకు 3 టెండర్లు మాత్రమే దాఖలయ్యాయి. నిరుడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏకంగా 140 టెండర్లు వచ్చాయి. ఈ ఏడాది టెండర్లు తక్కువ దాఖలవడంతో చేపల పిల్లల కొనుగోలు ధర పెరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం టెండర్లు రాని జిల్లాలను పక్క జిల్లాల టెండర్‌దారులకు అప్పగించాలని మత్స్యశాఖ యోచిస్తున్నట్టు తెలిసింది.

ఆగస్టు పూర్తయింది.. పంపిణీ ఎప్పుడు?

వాస్తవానికి ఈ ఏడాది ఇప్పటికే చెరువుల్లో చేపపిల్లలను విడుదల చేయాల్సి ఉన్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా టెండర్లకే పరిమితమవడంతో ఈ ప్రక్రియ పూర్తయ్యేదెప్పుడు? చేపపిల్లల పంపిణీని ప్రారంభించేదెప్పుడు? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సమయం మించిపోయిందని, మరింత ఆలస్యమైతే చేపపిల్లల పెరుగుదలపై ప్రభావం పడి లాభాలు తగ్గుతాయని మత్స్యకారులు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవతో టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, చేపపిల్లల పంపిణీని ప్రారంభించాలని కోరుతున్నారు.

రొయ్యపిల్లల పంపిణీకి స్వస్తి

ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం రొయ్యపిల్లల పంపిణీకి స్వస్తి పలికింది. నిరుటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపపిల్లలతోపాటు రొయ్యపిల్లలను కూడా పంపిణీ చేసింది. కానీ, ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం రొయ్యపిల్లల పంపిణీకి టెండర్లు పిలవలేదు. దీంతో ఈసారి పంపిణీ లేనట్టేనని మత్స్యశాఖ వర్గాలు చెప్తున్నాయి.

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

- ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి
- బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్
- ఆమరణ దీక్ష చేస్తున్న బీసీ నేతలకు పరామర్శ
- ఎమ్మెల్యే కూనంనేని సహా అన్ని పార్టీల నేతల మద్దతు

హైదరాబాద్, సెప్టెంబర్1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, కులగణన కోసం డిమాండ్ చేస్తూ గాంధీ దవాఖానలో 8వ రోజు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు సిద్దేశ్వర్, బీసీయూత్ అధ్యక్షుడు సంజయ్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కులగణన చేసి రిజర్వేషన్లను పెంచడానికి అభ్యంతరమేమిటని ప్రశ్నించారు. వీటిని పట్టించుకోకపోవడమంటే బీసీల వ్యతిరేక చర్యేనని మండిపడ్డారు. బీసీ నేతలు 8 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బీసీల పట్ల వివక్ష కనిపిస్తున్నదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి, బీసీ రిజర్వేషన్ల పెంపు నిర్ణయం ప్రకటించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఎన్నికల వాగ్దానంపై జాప్యం ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశం, బీసీ నాయకులు రవియాదవ్, బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు వారిని పరామర్శించి మద్దతు తెలిపారు.

5 నెలలుగా బిల్లుల చెల్లింపుల్లేవ్!

- మార్చి నుంచి నిలిచిన గ్యాస్, కూరగాయల బిల్లులు
- వెంటనే చెల్లించాలి అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్
- దాదాపు ఏడు వేల అంగన్‌వాడీలలో పోస్టులు ఖాళీ
- పెరిగిన పనిభారంతో ఇబ్బంది పడుతున్న సిబ్బంది

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఐదు నెలలుగా గ్యాస్, కూరగాయల బిల్లులు చెల్లించటం లేదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నుంచి ఆగస్టు వరకు చెల్లించాల్సిన బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇవే పరిస్థితులు ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లోనైతే జనవరి నుంచి ఇప్పటి వరకు బిల్లులు రావటం లేదని తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘం నాయకులు చెప్తున్నారు. మంత్రులు, అధికారులను కలిసినా ప్రయోజనం లేదని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని సకాలంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

పెరిగిన పనిభారం

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 35,700 టీచర్లు, 35,700 మంది హెల్పర్ పోస్టులు ఉన్నాయి. రెండు నెలల క్రితం వరకు అన్ని పోస్టులు నిండుగానే ఉన్నాయి. కాని కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన చట్టం ప్రకారం 65 ఏండ్లు దాటిన వాటిని విధుల నుంచి తొలగించారు. దాంతో 7000 వరకు ఖాళీలు ఏర్పడ్డాయి. ఆ స్థానాల్లో కొత్తవారిని ఎంపిక చేయలేదు. ఉన్నవారితోనే అదనపు సేవలు వినియోగించుకుంటున్నారు. దీంతో ఒకటి కంటే ఎక్కువ కేంద్రాల్లో టీచర్‌గా, ఆయాగా పని చేయాలంటే సాధ్యం కావటం లేదని, పనిభారం పెరుగుతున్నదని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అంగన్‌వాడీల్లో అదనపు సిబ్బందిని నియమించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ కేంద్రాల్లో జనాభా ప్రాతిపదికన సిబ్బందిని అదనపు నియమించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. చాలా అంగన్‌వాడీల్లో ఒక టీచర్, ఒక ఆయా మాత్రమే ఉండటంతో అందరికీ పోషకాహారాన్ని అందించడం సాధ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలవారీగా జనాభాను లెక్కించి అంగన్‌వాడీ కేంద్రాలను హేతుబద్ధీకరించేందుకు లేదా అదనపు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అంగన్‌వాడీల్లోని సిబ్బందితో పనులు చేయించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు రకాల యాప్‌లను ఏర్పాటు చేశాయి. పిల్లలు, తల్లులు వివరాలను ఈ రెండు యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి వస్తుండటంతో అంగన్‌వాడీల సిబ్బందిపై పనిభారం పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్న వివరాలను సమర్పించేందుకు రెండు రకాల యాప్‌లను కాకుండా సింగిల్ యాప్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షాలపై సోయిలేదు.. ఢిల్లీకి చక్కర్లా?

- మ్యానిఫెస్టోలో ఎన్ని హామీలు అమలు చేసిండ్రు?
- కేసీఆర్ ప్రజల్లోకి వస్తారంటేనే కాంగ్రెస్‌కు భయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్
- రేవంత్ భాషను మంత్రులకు నేర్పుతున్నరు
- హైడ్రాకు చట్టబద్ధత ఉన్నదా? : ఎమ్మెల్యే వివేకానంద

మీడియా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం, మంత్రులకు సోయిలేదు కానీ ఢిల్లీకి మాత్రం 20 సార్లు చక్కర్లు కొట్టారంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. వర్షాలతో మహబూబాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని, అక్కడి ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరారు. కేసీఆర్ ప్రజలల్లోకి వస్తారని కాంగ్రెస్ నాయకులకు భయం పట్టుకున్నదని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల్లోకి ఎందుకు రాకూడదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చినందుకు రావద్దా అంటూ నిలదీశారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు సీఎం, మంత్రులకు లేదని, కేసీఆర్ కొట్లాడి రాష్ట్రం తెస్తేనే సీఎం, మంత్రులు అయ్యారనే విషయాన్ని భట్టి గుర్తు పెట్టుకోవాలని హితవుపలికారు. కేసీఆర్‌కు ప్రజల్లో ప్రత్యేక స్థానం ఉన్నదని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తారని తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మనస్తాపం చెందినప్పుడు ఏదో ఒకటి మాట్లాడుతారంటూ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ నేతలను చూసి ప్రజలు ఓట్లెయ్యలేదని, ఆ పార్టీ మ్యానిఫెస్టోను చూసి ఓట్లేసి మోసపోయారని చెప్పారు. మ్యానిఫెస్టోలో ఉన్న హామీల్లో ఎన్ని అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై వ్యవసాయ శాఖ మంత్రిని రైతులు అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై ఇష్టంవచ్చినట్టు మాట్లాడిన రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టిందని, అయినా ఆయనలో మార్పు రాలేదని విమర్శించారు.

సీఎం పదవి అప్రతిష్టపాలు

దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వంగా తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ నిలిచిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని, సీఎం పదవిని అప్రతిష్టపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి తన భాషను డిప్యూటీ సీఎం, మంత్రులకు నేర్పించి, వారితో కేసీఆర్‌ను తిట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవాచేశారు. రేవంత్ పాలనపై ప్రజలు విసుగుచెంది, కేసీఆర్ పాలన మళ్లీ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. వర్షాలు, వరదలపై సీఎం, మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి స్థాయి తగ్గిపోయిందని, ఇప్పటి వరకు మంత్రులను, టీపీసీసీ చీఫ్ పదవులను ఆయన భర్తీ చేసుకోలేకపోవడమే ఇందుకు నిదర్శమని తెలిపారు. హైడ్రాకు మార్గదర్శకాలేవీ లేవని, చట్టబద్ధత కూడా లేదని, హైడ్రా పేరుతో కాంగ్రెస్ నాయకులు దందాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం తమ్ముడి ఇంటికి నోటీసులు మాత్రమే ఇచ్చారని, పేదల ఇండ్లను మాత్రం చెప్పాపెట్టకుండా కూల్చివేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ ఎప్పుడూ అభివృద్ధి చెందలేదని గుర్తుచేశారు. ఎక్కువ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయే నగరంలో అత్యధిక అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ నేతలు చెరువులను కబ్జా చేసి ఇండ్లు నిర్మించారని, రియల్ ఎస్టేట్ కోసమే ఫోర్త్ సిటీ అని ఆరోపించారు. స్క్వేర్ ఫీట్‌కు వంద చొప్పున బిల్డర్ల నుంచి వసూలు చేస్తున్నారని, కాంగ్రెస్ నేతల దందాలను బయటపెడతామని వివేకానంద ప్రకటించారు.

అధిష్ఠానానిది ఓ దారి..అనుములది మరో దారి

మొదటిపేజీ తరువాయి...

వ్యాఖ్యలు వంటివి అధిష్ఠానం ఆగ్రహానికి కారణమని సమాచారం. ఓవైపు ఢిల్లీలో కటీఫ్.. మరోవైపు అనుభవలేమి.. ఇంకోవైపు సహకరించని మంత్రులు.. ఫలితంగా రాష్ట్రంలో పాలన గాడి తప్పిందనే భావన ప్రజల్లో మొదలైంది. దీంతో తాను 'టఫ్' సీఎంను అని నిరూపించుకునేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఈ క్రమంలో తీసుకుంటున్న 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు బూమరాంగ్ అవుతున్నాయని, పార్టీలో చర్చ జరుగుతున్నది. తన స్వభావానికి విరుద్ధంగా ఎంత ఓపికగా ప్రయత్నాలు చేస్తున్నా అధిష్ఠానం ప్రసన్నం కావడం లేదు. సొంత పార్టీలోనే తన స్థానానికి ఎసరు పెట్టే నేతలపై రేవంత్ దృష్టిపెట్టినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్పుకుంటున్నారు. కొందరితో కాంప్రమైజ్ అవుతుంటే, మరికొందరిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు.

ఢిల్లీ మద్యం విధానంపైనా

- ఢిల్లీ మద్యం విధానం పేరుతో తెరమీదకి వచ్చిన కుంభకోణం మొత్తం బీజేపీ చేసి నకుట్ర అని కాంగ్రెస్ మొదటి నుంచీ వాదిస్తున్నది. పార్లమెంట్‌లోనూ గట్టిగా పోరాడుతున్నది. కానీ ఇందుకు విరుద్ధంగా రేవంత్‌రెడ్డి ఢిల్లీ మద్యం విధానంలో ఎమ్మెల్సీ కవితపై, కేసీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని అధిష్ఠానం తప్పుబడుతున్నట్టు తెలుస్తున్నది.

సుప్రీంకోర్టుపై వ్యాఖ్యలు

- సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం మధ్య కొంతకాలంగా ఘర్షణ వాతావరణం కనిపిస్తున్నదని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఇలాంటి సమయంలో కవిత బెయిల్ విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఇరుకున పెట్టినట్టు చర్చ జరుగుతున్నది.

'బడేభాయ్'పై గుర్రు

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని 'బడే భాయ్' అంటూ సంబోధించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు చెప్తున్నారు. కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం, రేవంత్‌రెడ్డి బీజేపీతో టచ్‌లో ఉన్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో జాతీయ స్థాయిలో తమకు ఇబ్బంది ఎదురైందని వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

బుల్డోజర్ రాజకీయాలు

- ఉత్తరప్రదేశ్‌లో బుల్డోజర్ రాజకీయాలు మొదలైనప్పటి నుంచీ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ముఖ్యంగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సందర్భం వచ్చిన ప్రతిసారి బుల్డోజర్ రాజ్ అంటూ మండిపడుతున్నారు.